నారాయణస్వామికి ఎదురుగాలి

- ఆయనకు టికెట్ ఇస్తే ఓడిస్తామంటున్న వ్యతిరేకవర్గం
- ఆయనే కావాలంటున్న అనుకూల వర్గం
- వైసీపీలో ఇన్‌చార్జుల మార్పు నేపథ్యంలో పెరిగిన వేడి

జీడీనెల్లూరు పాలిటిక్స్

చిత్తూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైసీపీ చాలాచోట్ల ఎమ్మెల్యేలను పోటీ నుంచి పక్కకు తప్పిస్తోంది. జిల్లాలో ఇప్పటికే పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు ఆ పార్టీ అధిష్ఠానం టికెట్ నిరాకరించిన విషయం.. చిత్తూరులోనూ ఆరణి శ్రీనివాసులును మారుస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం తెలిసిందే. మరోవైపు రాష్ట్రంలోని పలు నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేల స్థానంలో కొత్తగా ఇన్‌చార్జులను నియమిస్తోంది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం, జీడీనెల్లూరు ఎమ్మెల్యే నారాయణస్వామిని కూడా మార్చాలంటూ అక్కడ సొంత పార్టీ నుంచి తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. సోమవారం పెనుమూరు మండలం పులిగుండు శివాలయం వద్ద నారాయణస్వామి వ్యతిరేక వర్గం సమావేశమై నారాయణస్వామికి టికెట్ వద్దని, కొత్త అభ్యర్థిని ప్రకటిస్తే గెలిపించుకుంటామని తీర్మానించారు. నియోజకవర్గంలో ముందు నుంచీ జ్ఞానేంద్రరెడ్డి వర్గం వ్యతిరేకంగా ఉన్నప్పటికీ.. రాష్ట్ర వ్యాప్తంగా అభ్యర్థుల మార్పులు చేర్పుల నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. పెనుమూరు మండలానికి చెందిన మాజీ ఎంపీ, ఎన్ఆర్ఐ సలహాదారు జ్ఞానేంద్రరెడ్డికి, డిప్యూటీ సీఎం నారాయణస్వామికి తొలి నుంచీ పడటంలేదు సమయం దొరికినప్పుడల్లా పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు. ఆ మధ్య పెనుమూరు మండల సర్వసభ్య సమావేశానికి నారాయణస్వామి వస్తున్నారని తెలిసి.. మొదలైన 5 నిమిషాలకే జ్ఞానేంద్రరెడ్డి వర్గమైన ఎంపీపీ హేమలత సమావేశాన్ని ముగించారు. గడప గడపలో భాగంగా జ్ఞానేంద్రరెడ్డి, ఎంపీపీల సొంత గ్రామమైన గుంటిపల్లెకు డిప్యూటీ సీఎం వస్తుండగా రోడ్డుకు అడ్డంగా ముళ్ల కంచె వేసి అడ్డుకున్నారు. ఇటీవల పెనుమూరులో జరిగిన పెంచిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి నారాయణస్వామి హాజరయ్యారని ఎంపీపీ హేమలత, జడ్పీటీసీ దొరస్వామి సహా మరికొందరు నాయకులు గైర్హాజరయ్యారు. ఇటీవల జీడీనెల్లూరు టికెట్ మళ్లీ నారాయణస్వామికే అని ఆయన అనుచరులు పెనుమూరులో టపాసులు పేల్చి సంబరాలు జరుపుకొన్నారు. వెంటనే మరుసటిరోజు జ్ఞానేంద్రరెడ్డి వర్గమైన దయాసాగర్ రెడ్డి మరికొందరు తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డిని కలిసి స్వామికి టికెట్ ఇవ్వద్దంటూ కోరారు. అలాగే సజ్జలతోనూ తమ అభ్యంతరాన్ని వివరించినట్లు తెలిసింది.

'ముద్దు.. వద్దు..' అంటూ పరస్పర సమావేశాలు

నారాయణస్వామి వద్దంటూ సోమవారం పులిగుండు శివాలయం వద్ద జ్ఞానేంద్రరెడ్డి వర్గం సమావేశమై తీర్మానించింది. ఆయనకు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించింది. మరోవైపు నారాయణస్వామి కావాలంటూ ఆయన అనుకూల వర్గం కూడా ప్లకార్డులు చూపుతూ మీడియా సమావేశం నిర్వహించారు. దీనిపై మంగళవారం సమావేశం కానున్నట్లు సమాచారం.



నారాయణస్వామి వద్దు అని ప్లకార్డులు చూపుతున్న వైసీపీ నాయకులు

పెనుమూరులో అసమ్మతి మీట్



మాట్లాడుతున్న వైసీపీ నేత దయాసాగర్‌రెడ్డి

పెనుమూరు: జీడీనెల్లూరు ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం నారాయణస్వామి వ్యతిరేక వర్గ నేతలు సోమవారం పెనుమూరు మండలంలోని పులిగుండు శివాలయం వద్ద ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సత్యవేడు నియోజకవర్గ వైసీపీ పరిశీలకుడు దయాసాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో 'జగనన్న ముద్దు, నారాయణస్వామి వద్దు' అంటూ నేతలు, కార్యకర్తలు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. కుల రాజకీయాలు చేస్తూ సొంత పార్టీ కార్యకర్తలపైనే కేసులు పెట్టించారంటూ నారాయణస్వామిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యకర్తలకు అందుబాటులో లేకుండా పుత్తూరులో ఉంటూ ఫోన్లలో మాట్లాడుతుంటారన్నారు. అధిష్ఠానం ఇంకా ఏమీ చెప్పకనే తనకే టికెట్ వచ్చిందంటూ నాయకులను రెచ్చగొట్టి టపాసులు కాల్చడం వంటివి చేస్తున్నారన్నారు. ఆయనకు సర్వేలు కూడా వ్యతిరేకంగా ఉన్నాయని, అలాంటి ఆయనకు టికెట్ ఇవ్వకుండా ఎవరికి ఇచ్చినా గెలిపించుకుంటామని వారు చెప్పారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ దొరస్వామి, ఎంపీపీ హేమలత, పాలసముద్రం ఎంపీపీ భర్త శివప్రకాష్‌రాజు, జిల్లా కోశాధికారి ధనంజయరెడ్డి, గుణశేఖర్‌రాజు జీడీనెల్లూరు మాజీ జడ్పీటీసీ గుణశేఖర్ మొదలియార్, కార్వేటినగరం మండలం బండి జగదీశ్‌రెడ్డి, బాలాజీరెడ్డి, వైస్ ఎంపీపీ కోదండన్, గోవింద్‌రెడ్డి, దూది వెంకటేశ్, చక్రవర్తి నాయుడు, నరసింహారెడ్డితో పాటు మరికొందరు నాయకులు పాల్గొన్నారు.

'ఆయనతో ఉండేది పది మంది రెడ్లే'

గంగాధరనెల్లూరు, జనవరి 8: పెనుమూరులో జ్ఞానేంద్రరెడ్డితో ఉండేది పది మంది రెడ్లేనని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అనుకూల వర్గ నేతలు రాష్ట్ర గ్రీన్ అండ్ బ్యూటీఫికేషన్ డైరెక్టర్ గుణశేఖర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వెంకటరెడ్డి ఎద్దేవా చేశారు. జీడీనెల్లూరులో సోమవారం వీరు విలేకరులతో మాట్లాడారు. నామినేటెడ్ పదవులు అనుభవించాక డిప్యూటీ సీఎంను వ్యతిరేకించడం భావ్యంకాదన్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా నారాయణస్వామినే ముద్దు అంటూ నినాదాలు చేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చిన్నమరెడ్డి, మండల ఆర్‌టీకేల అడ్వైజరీ కమిటీ చైర్మన్ బలరామిరెడ్డి, పెనుమూరు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వేలుమొదలి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ నరసింహులునాయుడు, వైస్ ఎంపీపీ హరిబాబు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, ఏకాంబరం, మండల వైసీపీ మాజీ కన్వీనర్ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆవేదనతో పెట్రోలు పోసుకుంటూ...



ఆక్రోశంతో మాట్లాడుతూ...



పోలీసు నిర్బంధంలోనూ సడలని స్థైర్యం



ఆస్పత్రిపాలై అచేతనంగా



న్యాయం కోసం నినాదం



ఆర్డీవో ఆఫీసు ముందు టీడీపీ దీక్షా శిబిరం వద్దకు చేరిన వైసీపీ శ్రేణులు

దొంగ ఓట్లను తొలగిస్తారా? లేదా?

- చంద్రగిరి నియోజకవర్గంలో దొంగ ఓట్లను తొలగించాలంటూ దీక్ష చేపట్టిన విపక్షం
- పోటీగా దీక్షకు దిగిన వైసీపీ శ్రేణులు

పోలీసుల తీరును నిరసిస్తూ ఒంటిపై పెట్రోల్ పోసుకున్న పులివర్తి నాని ● అస్వస్థతకు గురవడంతో స్విమ్స్‌లో చికిత్స

తిరుపతి (రవాణా), జనవరి 8: చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో దొంగ ఓట్లను ఎప్పుడు తొలగిస్తారని టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని ప్రశ్నించారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద సోమవారం ఉదయం దొంగ ఓట్లను తొలగించాలంటూ ఆయన నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మీడియాతో మాట్లాడుతూ ఆర్డీవో నుంచి కలెక్టర్, ఎన్నికల కమిషన్ దాకా దొంగ ఓట్లను తొలగించాలని వందలాది వినతిపత్రాలు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు బీఎల్వోలకు షోకాజ్ నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి కనుసన్నల్లోనే ఈ తతంగమంతా జరిగిందని ఆరోపించారు. ఇప్పటికైనా ఈసీ అధికారులు చొరవ తీసుకుని దొంగ ఓట్లను పూర్తిగా తొలగించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.నానీకి మద్దతుగా నియోజకవర్గపరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున నిరాహార దీక్షలో పాల్గొన్నారు.దొంగ ఓట్లు తొలగించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలంటూ నినాదాలు చేశారు. చంద్రగిరి నియోజకవర్గ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యం నాయుడు, గౌస్ బాషా, మధు, హేమాంబరధరరావు, ఈశ్వరయ్య, పెరుగు భాస్కర్‌రెడ్డి, సింగ్ సుధ, మహేశ్వరి, సురేష్‌నాయుడు, బిరుదాల భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.కాగా నాని చేపట్టిన దీక్షకు తిరుపతి టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ, కృష్ణయాదవ్, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, రవి మనోహరాచారి తదితరులు మద్దతు తెలిపారు.

టీడీపీ దీక్షను నీరుగార్చేందుకు రంగంలోకి వైసీపీ

ఉదయం 11గంటల ప్రాంతంలో ప్రారంభమైన దీక్షను జోరువానలోనూ పులివర్తి నాని కొనసాగించారు. దీక్షకు పెద్దఎత్తున మద్దతు లభించడం, నియోజకవర్గంలో చర్చనీయాంశం కావడంతో వైసీపీ అప్రమత్తమైంది.టీడీపీ దీక్షను ఎలాగైనా నీరుగార్చాలన్న ఉద్దేశంతో తిరుపతి రూరల్ ప్రాంతంలోని అవిలాల సర్పంచ్ సీపీ రమణ, పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, మల్లంగుంటకు చెందిన వైసీపీ నేత రామచంద్రయ్య, వేదాంతపురానికి చెందిన ప్రేమ్‌కుమార్, సి.మల్లవరానికి చెందిన మల్లారపు వాసు, గాంధీపురానికి చెందిన మన్నూరు శివ, సెల్వం తదితరులు మధ్యాహ్నం 2.15గంటల ప్రాంతంలో ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని టీడీపీ దీక్ష శిబిరం పక్కనే దీక్ష చేపట్టారు.టీడీపీ తరఫున దొంగ ఓటర్లను తొలగించాలంటూ నినాదాలు చేస్తే దళితుల ఓట్లను తొలగించిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలంటూ వైసీపీ శ్రేణులు నినాదాలు చేశాయి. దీంతో ఆర్డీవో కార్యాలయం వద్ద ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.డీఎస్పీలు యశ్వంత్, సురేంద్రరెడ్డి, సీఐలు అబ్బన్న, శివప్రసాద్‌రెడ్డి, జయనాయక్, ఎస్ఐలు సిబ్బందితో రంగప్రవేశం చేసి వైసీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం టీడీపీ నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారు.దీక్ష విరమించాలని లేకపోతే అరెస్టు చేయాల్సి వస్తుందని నానీకి చెప్పడంతో తాను శాంతియుతంగా దీక్ష చేస్తున్నానని చెప్పారు.దీక్ష విరమించబోనని అవసరమైతే ఆత్మహత్యకు సిద్ధమవుతానని చెప్పి పెట్రోలు ఒంటిపై పోసుకున్నారు. దీంతో మరింత ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వెంటనే కొందరు కార్యకర్తలు సైతం ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. గమనించిన పోలీసులు పెట్రోల్ క్యాన్‌ను పక్కకు లాగేసి మంచినీళ్ల పోశారు.ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకుని తిరుచానూరులో ఇంటివద్ద వదిలిపెట్టారు. పెట్రోల్ ఒంటిపై పోసుకున్న సమయంలో కళ్లలో పడటంతో నాని అస్వస్థతకు గురయ్యారు.దీంతో పార్టీ శ్రేణులు స్విమ్స్ ఆస్పత్రికితరలించారు.అక్కడ డాక్టర్లు ఆయనకు వైద్యం అందించి భయపడాల్సిన అవసరం లేదన్నారు.స్విమ్స్‌లో నాని చేరిన విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు పెద్దఎత్తున స్విమ్స్‌కు తరలివచ్చారు.

వైసీపీని ఊడ్చి గంగలో వేస్తారు

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ విమర్శ



నగరిలో మున్సిపల్ కార్మికులతో కలిసి సమ్మెలో పాల్గొన్న నారాయణ

నగరి, జనవరి 8: అంగన్వాడీ కార్యకర్తలు, పారిశుధ్య కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుంటే వైసీపీ ప్రభుత్వాన్ని ఊడ్చి గంగలో వేస్తారని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరించారు. నగరి మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం జరిగిన సమ్మెలో ఆయన పాల్గొన్నారు. పారిశుధ్య పనులు చేస్తూ ప్రజలను అనారోగ్యం నుంచి కాపాడే కార్మికులు రోడ్డెక్కి ధర్నా చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం పోరాడుతున్న వారి విషయంలో ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా ఉండటాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. అంగన్వాడీ కార్యకర్తలు 27 రోజులుగా సమ్మె చేస్తున్నా వారి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకపోగా ఎస్మా చట్టాన్ని తేవడంతో ప్రభుత్వం తన గొయ్యిని తానే తవ్వుకున్నట్లయిందన్నారు. మహిళా కార్మికులని కూడా చూడకుండా మంత్రులు, ఎమ్మెల్యేలు అసభ్యంగా మాట్లాడటం దారుణమన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండు చేశారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని రాబోయే రెండు నెలల్లో ఇంటికి పంపడానికి ఉద్యోగ, కార్మికులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, పట్టణ నాయకులు వేలన్, బాషా, రూప్‌కుమార్, విజయకుమార్, మురళి, శేఖర్, సతీష్, సుబ్రమణ్యం, ఏసుదాసు, మురగమ్మ తదితరులు పాల్గొన్నారు.





పలమనేరు, నగరిలో వర్షంలోనూ నిరసన కొనసాగిస్తున్న అంగన్వాడీలు

వానలోనూ నిరసనలు

చిత్తూరు, జనవరి 8: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె సోమవారానికి 28వ రోజుకు చేరింది. వర్షం పడుతున్నా లెక్క చేయకుండా ఆందోళనలు కొనసాగించారు. కలెక్టరేట్ వద్ద అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్ష మూడోరోజుకు చేరుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా తమ పోరాటాన్ని సాగించారు. కుప్పం సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోగా.... బెదిరింపులకు దిగుతోందని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తంచేశారు. ఉద్యమాన్ని అణచివేయాలని చూడడం దారుణమన్నారు. పలమనేరులో ఉదయం నుంచి సాయంత్రం వరకు శిబిరం వద్ద వర్షంలో గొడుగులు పట్టుకొని తమ నిరసన తెలిపారు. పుంగనూరు, నగరిలోనూ అంగన్వాడీలు గొడుగులు పట్టుకుని నిరసన తెలిపారు.

కలెక్టరేట్ వద్ద నిరసనాగ్రహం


నిరసన తెలుపుతున్న తెలుగు యువత నేతలు


నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు


వర్షంలోనూ సమగ్రశిక్ష ఉద్యోగుల ఆందోళన

'స్పందన'లో భాగంగా సోమవారం చిత్తూరు కలెక్టరేట్ వద్ద తెలుగు యువత నేతలు, అంగన్వాడీలు, సమగ్ర శిక్ష ఉద్యోగులు నిరసనాగ్రహం ప్రకటించారు. ఓ పక్క వర్షం కురుస్తున్నప్పటికీ ఆందోళనకారులు వెనక్కి తగ్గలేదు. తమ డిమాండ్లు నెరవేర్చాలన్నారు.

- చిత్తూరు

జాబ్ క్యాలెండర్ ఏదీ?

వేలాది మంది యువత ఆత్మహత్యలకు సీఎం నిర్లక్ష్యమే కారణమని తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు రాజేష్ ఆరోపించారు. నాలుగున్నరేళ్లయినా జాబ్ క్యాలెండర్ ప్రకటించకపోవడంపై జనసేన, తెలుగు యువత నేతలు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఉద్యోగాలు లేకపోవడంతో యువత ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందని రాజేష్ ఆవేదన వ్యక్తంచేశారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికి ఒక్కటి కూడా విడుదల చేయలేదన్నారు. టీడీపీ హయాంలో డీఎస్సీ ద్వారా రెండు విడతల్లో 18 వేల ఉద్యోగాలు కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. నిరుద్యోగం కారణంగా యువత వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనసేనపార్టీ నేత యశ్వంత్, తెలుగు యువత నేతలు భరత్, చంద్రబాబురెడ్డి, హేమాద్రి, మంజు, దిలీప్, గుణ తదితరులు పాల్గొన్నారు.

ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తాం

హామీలను విస్మరించిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్, అంగన్వాడీ యూనియన్ నాయకులు షకీల, ప్రేమ, ప్రభావతి, సుజని హెచ్చరించారు. కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలో వీరు మాట్లాడారు. అంగన్వాడీలపై ఎస్మాను ప్రయోగించినా భయపడేదే లేదని స్పష్టం చేశారు. వర్షంకురుస్తున్నా లెక్కచేయక నిరసనలతో ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టారు. అంగన్వాడీలకు టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ సంఘీభావం ప్రకటించారు. భోజనాలను పంపిణీ చేశారు. టీడీపీ నేతలు వరలక్ష్మి, జాఫర్, నంద, అత్తు, సర్దార్, జిలాని, నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షంలోనూ సమ్మె

సమగ్రశిక్ష ఉద్యోగులు వర్షంలో కూడా సోమవారం సమ్మెను కొనసాగించారు. విధులకు హాజరుకాకుంటే తొలగిస్తామని నోటీసులు ఇవ్వడం సరికాదని ఉద్యోగ సంఘ నేతలు వాపోయారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, ఉద్యోగులను క్రమబద్ధీకరించే వరకు ఆందోళనలను విరమించబోమని ప్రకటించారు.

కొంగాటంలో బంగారు ఆభరణాల చోరీ


ఇంట్లో వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు

వి.కోట, జనవరి 8: వి.కోట మండలం కొంగాటంలోని సుబ్రమణ్యం ఇంట్లో బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. అయన చిన్న కుమారుడు సోమవారం మధ్యాహ్నం కుప్పం కాలేజి నుంచి ఇంటికి చేరుకున్న ఆయన చిన్న కుమారుడు విశ్వనాథ్ ఇంటి తలుపులు తెరచిఉండడంతో వెళ్ళి చూడగా లోపల బంగారు ఆహరణాల పెట్టెలు చిందరవందరగా పడిఉన్నాయి. దీంతో అతను కుటుంబసభ్యులకు ఫోన్ చేయగా వ్యవసాయ పనులకు వెళ్ళిన వారు ఇంటికి చేరుకుని చోరీ జరిగినట్లు గుర్తించారు. తక్షణం చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ లింగప్ప సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని చోరీపై విచారణ చేపట్టారు. ఏడాది క్రితం సుబ్రహణ్యం పెద్ద కుమారుడు లోకేషకు వివాహం జరిగింది. అతడికి చెందిన ఆభరణాలు ఇంట్లో ఉంచి, వారు బెంగళూరులో ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తూ అక్కడే ఉంటుండగా, గ్రామంలో సుబ్రమణ్యం, అతడి భార్య రత్నమ్మ, చిన్నకుమారుడు ఉంటున్నారు. వ్యవసాయ పనులకు వెళ్ళేప్పుడు ఇంటికి తాళం వేసి ఓ చోట ఉంచి వెళ్ళే వారమని, సోమవారం యథాప్రకారం వెళ్ళగా, ఎవరో కనిపెట్టి దాచి ఉంచిన తాళం తీసి చోరీ చేసినట్లు బాధితులు పోలీసులకు తెలిపారు. సుమారు 150 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, కొంత నగదు చోరీ అయినట్లు ఫిర్యాదు చేశారు. చిత్తూరు నుంచి క్లూస్ టీం ఈ గ్రామానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. పల్లెకు ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చి వెళ్ళారా..? లేక ఇక్కడి వారే చోరీకి పాల్పడ్డారా..? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

టీటీడీ ఆలయాల సమాచారంతో కొత్త వెబ్‌సైట్

తిరుపతి (కల్చరల్), జనవరి 8: తిరుపతి, ఇతర ప్రాంతాల్లోని టీటీడీ అనుబంధ ఆలయాలకు సంబంధించిన పూర్తి సమాచారంతో కొత్త వెబ్‌సైట్ (ttdevasthanams.ap.gov.in)ను టీటీడీ సోమవారం ప్రారంభించింది. మహతి వేదికగా టీటీడీ పాలకమండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి దీన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో 60 ఆలయాలకు సంబంధించి స్థల పురాణం, దర్శనం, పూజాదికాల వేళలు, రవాణా, వసతి, ఆర్జిత సేవల వివరాలు పొందుపరిచామని భూమన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవో ధర్మారెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా ప్రొఫెసర్ నాగోలు కృష్ణారెడ్డి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 8: ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా ప్రొఫెసర్ నాగోలు కృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఈనెల 6, 7 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన ఏపీ హిస్టరీ కాంగ్రెస్ 46వ వార్షిక సదస్సులో ఆయన్ను ఎన్నుకున్నారు. ఎస్వీయూనివర్సిటీ ప్రాచీన భారతదేశ చరిత్ర, సంస్కృతి, పురావస్తు విభాగంలో ప్రొఫెసర్‌గా పదవీ విరమణ పొందారు. టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తిరుమల మ్యూజియం డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. చరిత్ర, సంస్కృతి, సాహిత్యంపై 16 పుస్తకాలు, 95 పరిశోధనా వ్యాసాలు రాశారు. 72 జాతీయ, అంతర్జాతీయ సదస్సుల్లో పాల్గొన్నారు. ప్రత్యేకించి శాసనాల వెనుక దాగున్న చరిత్రను వెలికితీశారు. ఇదివరకే ఏపీ హిస్టరీ కాంగ్రెస్ ప్రొసీడింగ్స్‌కు సంపాదకులుగా వ్యవహరిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సంయుక్త కార్యదర్శిగా నియమితులయ్యారు. ఎస్వీయూ ఓఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ పీసీ వేంకటేశ్వర్లు హర్షం వ్యక్తం చేశారు.

ఓఆర్ఐ పరిశోధకుడు నరేష్ మృతి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జనవరి 8: ఎస్వీ యూనివర్సిటీ ప్రాచ్య పరిశోధనా సంస్థ (ఓఆర్ఐ) పరిశోధకుడు డాక్టర్ వెలిగారం నరేష్ (43) మృతి చెందారు. చిత్తూరు సమీపంలో గల బ్రాహ్మణపల్లెకు చెందిన ఆయన తరిగొండ వెంగమాంబ సాహిత్యంపై ఆచార్య చిట్రాజు గోవిందరాజుల పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. కొంతకాలంగా కామెర్లతో బాధపడుతూ సోమవారం కన్నుమూశారు. నరేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మృతి పట్ల ఓఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ పీసీ వేంకటేశ్వర్లు సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి వారు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు

తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 76,058 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 22,543 మంది తలనీలాలు సమర్పించారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(ఆటోనగర్) జనవరి 8: సంక్రాంతి పండుగ సందర్భంగా రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే తిరుపతి-సికింద్రాబాదు-కాకినాడ మధ్య ప్రత్యేక రైళ్లు (07055-07072-02707) నడపనున్నట్లు సీపీఆర్ఓ సీహెచ్ రాకేష్ తెలిపారు. ఈ రైళ్లు ఈ నెల 10, 14, 15 తేదీలలో రాకపోకలు సాగిస్తాయని, ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

తిరుమలలో హీరో సుధీర్ బాబు



తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : శ్రీవారి దర్శనార్థం సినీ హీరో సుధీర్‌బాబు సోమవారం తిరుమలకు వచ్చారు. తిరుమలలోని కావేరి విశ్రాంతి భవనానికి చేరుకున్న ఆయనకు స్థానిక అభిమానులు స్వాగతం పలికారు. మంగళవారం ఉదయం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

తైక్వాండో అసోసియేషన్ నూతన కార్యవర్గం


చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న నూతన కార్యవర్గ ప్రతినిధులు

తిరుపతి (విద్య), జనవరి 8: తిరుపతిలోని తైక్వాండో అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా తైక్వాండో కార్యవర్గ సమావేశం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఇందులో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అధ్యక్షుడిగా టి.ధనంజయులు, వైస్ ప్రెసిడెంట్లుగా డి.క్రాంతికుమార్, కె.వెంకటరమణాచారి, ప్రధాన కార్యదర్శిగా ఎ.మనోహరనాయుడు, సంయుక్త కార్యదర్శులుగా సి.రామనన్, సి.శంకర్, కోశాధికారిగా బి.శ్రీనివాసులు, ఈసీ సభ్యులుగా బీఎస్ అరుణ్, ఎం.సంతోష్, వి.కిరణ్, ఎ.కోదండం, సీఆర్ హర్షితను ఎన్నుకున్నారు. కాగా సంఘ ఆధ్వర్యంలో ఈనెల 17న చిత్తూరులో సబ్ జూనియర్ తైక్వాండో జిల్లాస్థాయి పోటీలను నిర్వహించాలని తీర్మానించామని ప్రకటించారు.

'స్పందన'కు 369 అర్జీలు


కలెక్టరేట్‌లో అర్జీలు ఇవ్వడానికి బారులు తీరిన జనం

చిత్తూరు, జనవరి 8: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 329 మంది అర్జీదారులు హాజరై జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్‌కు సమస్యలను విన్నవించారు. అర్జీలు అందజేశారు. బాధితుల సమస్యలను విని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఓ పక్క వర్షం కురుస్తున్నప్పటికీ అర్జీదారులు కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. బాధితుల సమస్యలకు నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. వచ్చిన అర్జీల్లో రెవెన్యూ శాఖకు 269, డీఎస్వోకు 17, నేషనల్ హైవేకు 6, ఉపాధి శాఖకు 5, పోలీసు శాఖకు 5 వంతున, మిగిలిన శాఖలకు 23 అర్జీలు అందాయి. కాగా, వెదురుకుప్పం మండలం జక్కిదొన గ్రామలెక్క దాఖలాలో కళ్లం భూమిని భూస్వాములు ఆక్రమించుకున్నారని ఆ గ్రామస్తులు ఆరోపించారు. దీనిపై తహసీల్దార్ నుంచి డిప్యూటీ సీఎం నారాయణ స్వామి వరకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. అగ్రకులస్తులు కళ్లం భూమిని ఆక్రమించుకుని కంచె వేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.


బాధితులు ఇచ్చిన అర్జీలను పరిశీలిస్తున్న ఏఎస్పీలు

పోలీసు స్పందనకు 25 వినతులు

చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి నలుమూలల నుంచి 25 మంది అర్జీదారులు హాజరయ్యారు. బాధితుల నుంచి ఏఎస్పీ సుధాకర్, సెబ్ ఏఎస్పీ శ్రీలక్ష్మి వినతిపత్రాలను స్వీకరించారు. వీటిలో భూతగాదాలు 11, డబ్బు తగాదాలు 4, దారి తగాదాలు 4, కుటుంబ తగాదాలు 3, వేధింపులు 2, ఇంటి తగాదాలు ఒకటి చొప్పున ఉన్నాయి.

ఒకటే జడివాన


వర్షంలో కలెక్టరేట్‌కు వస్తున్న అర్జీదారులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 8: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్నాయి. విడవని జడివానతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఆకాశమంతా మేఘావృతం కావడంతో పాటు చల్లటి గాలులు వీస్తుండటంతో వృద్ధులు బయటకు రావడానికి భయపడే పరిస్థితి నెలకొంది. చిత్తూరులో ఆదివారం రాత్రి 10.30 గంటల నుంచి సోమవారం సాయంత్రం 5 గంటల వరకు వర్షపు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. దాంతో ఉద్యోగులు, పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. కొనుగోలుదారులు రాకపోవడంతో వ్యాపారాలు జరగక చిరువ్యాపారులు దెబ్బతిన్నారు. ఆదివారం ఉదయం 8 నుంచి సోమవారం ఉదయం 8 గంటల వరకు 22 మండలాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురిసింది.


చిత్తూరులో..

మండలాల వారీగా గుడిపాలలో 14.0, పాలసముద్రంలో 12.2, యాదమరిలో 10.0, శ్రీరంగరాజపురంలో 9.0, నింద్రలో 7.2, చిత్తూరులో 6.2, బైరెడ్డిపల్లిలో 5.6, నగరిలో 4.6, శాంతిపురంలో 4.6, తవణంపల్లిలో 4.4, విజయపురంలో 3.6, సదుంలో 3.4, కార్వేటినగరంలో 2.4, బంగారుపాళ్యంలో 2.2, పులిచెర్లలో 2.0, గంగాధరనెల్లూరులో 2.0, వి.కోటలో 1.4, పూతలపట్టులో 1.0, గంగవరంలో 1.0, పలమనేరులో 1.0, సోమలలో 1.0, పుంగనూరులో 0.6, పెద్దపంజాణిలో 0.6, పెనుమూరులో 0.4 మిమీ చొప్పున వర్షపాతం నమోదైంది. జనవరి నెల సరాసరి వర్షపాతం 4.9 మి.మీ కాగా, సోమవారం నాటికి 3.2 మిమీ వర్షం పడింది.

ముగ్గురు వైసీపీ నేతలపై క్రిమినల్ కేసు

నకిలీ సర్టిఫికెట్లతో గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు -వీరిలో ఇద్దరు కార్పొరేటర్లు... మరొకరు మహిళా నేత

తిరుపతి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గతేడాది జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తిరుపతికి చెందిన ముగ్గురు వైసీపీ నాయకులు నకిలీ సర్టిఫికెట్లతో గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదయ్యారు. వీరి సర్టిఫికెట్లు నకిలీవని తేలడంతో క్రిమినల్ కేసు నమోదైంది.గతేడాది మార్చిలో రాయలసీమ తూర్పు నియోజకవర్గ పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల్లో తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 8వ డివిజన్ కార్పొరేటర్ మునిరామిరెడ్డి, 12వ డివిజన్ కార్పొరేటర్ ఎస్కే బాబు, కొర్లగుంటకు చెందిన వైసీపీ నాయకురాలు విజయ ఓటర్లుగా నమోదయ్యారు. అయితే వీరు పట్టభద్రులు కాదని అప్పట్లో టీడీపీ పరిశీలకులుగా వ్యవహరించిన ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు వీరిపై తిరుపతిలో రెవిన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. అలాగే రాష్ట్ర పార్టీ నేతల దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై టీడీపీ రాష్ట్ర కార్యాలయం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదులపై స్పందించిన రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఓటర్లుగా నమోదయ్యేందుకు ముగ్గురు వైసీపీ నాయకులు సమర్పించిన సర్టిఫికెట్లు నిజమైనవేనా అని విచారణ నిర్వహించగా అవన్నీ ఫేక్ సర్టిఫికెట్లని తేలింది. దీంతో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో వైసీపీ నాయకులు వనజ, మునిరామిరెడ్డి, ఎస్కే బాబులపై క్రైమ్ నంబరు 157-2023 పేరిట క్రిమినల్ కేసు నమోదైంది. ఐపీసీ సెక్షన్ 171 డి, అలాగే ప్రజాప్రాతినిధ్య చట్టం 1950 సెక్షన్ 31 కింద ఈ కేసు నమోదైంది. అయితే జిల్లా అధికార యంత్రాంగం ఈ విషయాన్ని గోప్యంగా వుంచింది. తాజాగా 2024 సార్వత్రిక ఎన్నికలకు చేపట్టిన ఓటర్ల జాబితా సవరణల్లో పెద్దఎత్తున అవకతవకలు జరుగుతున్నాయని టీడీపీ కార్యాలయం నుంచీ ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు వెళ్ళిన సంగతి తెలిసిందే. ఆ ఫిర్యాదులపై తీసుకున్న చర్యలు వివరిస్తూ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి టీడీపీ కార్యాలయానికి సోమవారం పంపిన లేఖలో ఈ అంశాన్ని ప్రస్తావించడంతో సుమారు ఆరు నెలలు ఆలస్యంగా వైసీపీ నేతలపై కేసు నమోదైన సంగతి వెలుగు చూసింది. బాధ్యత కలిగిన డివిజన్ కార్పొరేటర్లుగా ప్రజాప్రతినిధులుగా వ్యవహరిస్తూ తప్పుడు విద్యార్హతల సర్టిఫికెట్లు సమర్పించి పట్టభద్రులమని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా పేర్లు నమోదు చేయించుకోవడం పట్ల తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

నడకమార్గాల్లో భక్తుల రక్షణకు చర్యలు

నిర్భయంగా నడిచిరావచ్చు: టీటీడీ ఈవో

తిరుమల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : తిరుమల నడకమార్గాల్లో అడవి జంతువుల నుంచి భక్తుల రక్షణ కోసం విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని, నిర్భయంగా శ్రీవారి దర్శనానికి నడిచి రావచ్చని టీటీడీ ఈవో ధర్మారెడ్డి అన్నారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో సోమవారం టీటీడీ, ప్రభుత్వ ఫారెస్ట్ అధికారులతో సమావేశమైన ఆయన మాట్లాడుతూ నడకమార్గాల్లో అడవి జంతువుల నుంచి భక్తుల రక్షణ కోసం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(వైల్డ్‌లైఫ్), ఏపీ చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. ఆ కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి నివేదిక సమర్పించిందన్నారు. టీటీడీ, ప్రభుత్వ అటవీశాఖ ఇప్పటివరకు తీసుకున్న స్వల్పకాలిక చర్యలపై చర్చించారు. దీర్ఘకాలిక చర్యలైన అడవి జంతువుల పర్యవేక్షణ, అందుకు కావాల్సిన భవన సదుపాయం, సిబ్బంది, వ్యాలైన్ల ఏర్పాటు, బయోఫెన్సింగ్(పొదల కంచె), ఏరియల్ వాక్ వే, అండర్ పాస్, ఓవర్ పాస్‌ల కోసం స్థల ఎంపిక ఇతర మౌలిక వసతులపై చర్చించారు. కెమెరాట్రాప్‌లు, మానిటరింగ్ సెల్, వ్యాలైన్ల ఏర్పాటు, అవుట్‌పోస్టుల నిర్వహణకు సత్వరం చర్యలు చేపట్టాలని, ఏడవ మైలు నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు నడకదారికి ఇరువైపులా లైటింగ్ వసతి కల్పించాలని, మానటరింగ్ సెల్ కోసం భవనాన్ని సమకూర్చాలని సీఈని కోరారు. నడక మార్గాల్లో వ్యర్థాలు లేకుండా చూడాలని హెల్త్ ఆఫీసర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో జేఈవో వీరబ్రహ్మం, సీసీఎఫ్ నాగేశ్వరరావు, ఎఫ్ఏసీఏవో బాలాజీ, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, జూపార్క్ క్యూరేటర్ సెల్వం, డీఎఫ్‌వో శ్రీనివాస్, తిరుపతి డీఎఫ్‌వో సతీష్ పాల్గొన్నారు.

ఈ భూమి మాదే.. కాదు మాదే..!

- అటు రెవెన్యూ.. ఇటు అటవీ శాఖల వాదన
- మధ్యలో నలిగిపోతున్న పట్టాలు పొందిన రైతులు

కేవీబీపురం, జనవరి8: తిరుపతి జిల్లా కేవీబీపురం మండలంలో ఆదవరం రెవిన్యూలో ఉన్న సర్వే నంబర్లు 194ఏ, 194బీలో ఉన్న సుమారు 4.87 ఎకరాల భూమి పక్కా సెటిల్‌మెంట్ నేల. ఈ భూమిని రైతులకు రెవెన్యూ వారు పట్టాలిచ్చారు. ఇటీవల అటవీ శాఖ వారు ఆ నేలలో ప్రవేశించ వద్దని అది రిజర్వుడు ఫారెస్టుకు చెందినదని రైతులపైన ఒత్తిడి తెచ్చారు. దీంతో రైతులు తహసీల్దార్‌ను ఆశ్రయించారు. ఈ వివాదంపై శ్రీకాళహస్తి ఎఫ్ ఆర్‌వో లోకేష్, డిప్యూటీ ఎఫ్ఆర్‌వో శ్రీనివాసులు సోమవారం తహసీల్దార్ శ్రీదేవిని కలిశారు. ఆ నేల తమదేనంటూ వాదించారు. దీంతో తహసీల్దార్ రికార్డులను పరిశీలించారు. 1952, 1957లో ఆ నేల సుమారుగా 250 ఎకరాల వరకు రెవిన్యూకు చెందినదిగానే ఉంది. ఆ నేలకు అప్పట్లో రైతులకు పట్టదారు పాసు పుస్తకాలు ఇచ్చారు. అప్పటి నుంచి ఆ నేల సెటిల్‌మెంట్‌గా చెలమణిలో ఉందని గుర్తిం చారు. అటవీ అధికారులు మాత్ర అందుకు అంగీకరించలేదు. చివరగా ఉమ్మడి జిల్లాలోని రికార్డులను సైతం పరిశీలించాక చర్చిద్దామని అటవీ అధికారులకు తహసీల్దార్ తెలియజేశారు. అంతవరకు రైతులపై చర్యలు తీసుకోరాదని సూచించారు. అటు అటవీ ఇటు రెవిన్యూ మధ్యలో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. జిల్లా అధికారులు స్పందించి న్యాయంచేయాలని రైతులు కోరుతున్నారు.

హైదరాబాదుకు మరో స్టార్‌లైనర్

తిరుపతి(కొర్లగుంట), జనవరి 8 : హైదరాబాదుకు జిల్లా నుంచి మరో స్టార్‌లైనర్(నాన్ ఏసీ స్లీపర్) సర్వీసు అందుబాటులోకి వచ్చినట్లు డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే తిరుపతి నుంచి ఓ సర్వీసు నడుస్తుండగా ప్రయాణికుల కోరిక మేరకు వెంకటగిరి నుంచి రెండు రోజుల క్రితం అందుబాటులోకి వచ్చింది. వెంకటగిరి ఆర్టీసీ బస్టాండు నుంచి ప్రతి రోజు రాత్రి 7.30గంటలకు బయల్దేరుతుంది. గూడూరు, నెల్లూరు, కావలి, ఒంగోలు, మిర్యాలగూడ మీదుగా హైదరాబాదు, బీహెచ్‌ఈఎల్‌కు మరుసటి రోజు ఉదయం 8గంటలకు చేరుకుంటుంది. అలాగే బీహెచ్‌ఈఎల్ నుంచి ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు బయల్దేరి మరుసటి రోజు ఉదయం 8.30 గంటలకు వెంకటగిరికి చేరుకుంటుంది. ముందస్తు ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం కల్పించారు.

కథలకు ఆహ్వానం

చిత్తూరు కల్చరల్, జనవరి 8: కుప్పం రెడ్డెమ్మ సాహితీ పురస్కారాలకు వర్ధమాన రచయితల నుంచి కథల సంపుటిలు, నవలలు, ఛందోబద్ధ, వచన కవితలను ఆహ్వానిస్తున్నట్లు పురస్కారాల ప్రదాతలు డాక్టర్ కె.రామలక్ష్మి, రోజాప్రియ, నిరంజన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన రచయితలు, కవులు మాత్రమే తమ రచనలను ఈనెల 31వ తేదీలోపు 'డాక్టర్ కె.రామలక్ష్మి, రామలక్ష్మి నర్సింగ్‌హోమ్, సుందరయ్యవీధి, చిత్తూరు-517001' చిరునామాకు పంపాలని కోరారు. ఏప్రిల్ 17న శ్రీరామ నవమి సందర్భంగా చిత్తూరులో నిర్వహించే కార్యక్రమంలో విజేతలకు పురస్కారాలను ప్రదానం చేస్తామని పేర్కొన్నారు.

12లోగా ఓటరు క్లెయిమ్‌లను పరిష్కరించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో సూచనలు చేస్తున్న జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 8: 'ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ఈనెల 22న ఓటరు తుది జాబితా ప్రచురణ జరగనుంది. ఇందులో భాగంగా ఇప్పటివరకు అందిన క్లెయిమ్‌లను ఈనెల 12వ లోగా పరిష్కరించాలి' అని జేసీ శ్రీనివాసులు సూచించారు. సోమవారం సాయంత్రం ఆయన డీఆర్వో రాజశేఖర్‌తో కలిసి మునిసిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, డీటీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గతనెల 9వ తేది నాటికి అందిన వివిధ క్లెయిమ్‌లు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని క్షేత్రస్థాయిలో పరిశీలించి అప్‌లోడ్ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాట్లపై అధికారులు ఇప్పటికే పరిశీలించాలన్నారు. ఈనెల 11న చిత్తూరులో జరిగే జిల్లాస్థాయి సమావేశానికి ఎన్నికల అధికారులందరూ హాజరుకావాలని ఆదేశించారు. కొన్ని మండలాల్లో అసైన్‌మెంట్ భూములకు సంబంధించి ఈకేవైసీ పెండింగ్‌లో ఉందని, వాటిని త్వరితగతిన పూర్తిచేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్డీవోలు చిన్నయ్య (చిత్తూరు), సృజన (నగరి), మనోజ్‌కుమార్ రెడ్డి (పలమనేరు), శ్రీనివాసులు (కుప్పం), ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడి.. పంటల ధ్వంసం



కల్లూరు, జనవరి 8: పులిచెర్ల మండలం కొమ్మిరెడ్డిగారిపల్లి సమీపంలో ఆదివారం రాత్రి పంటలపై ఏనుగులు దాడులు చేయడంతో మామిడి, టమోటా పంటలకు అపారనష్టం వాటిల్లింది. మిట్టమీదరాచపల్లెలోని రైతు రమణమ్మ పొలంలోని టమోటా పంటను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు 20 మామిడిచెట్లను, బోరు పైపులు, డ్రిప్ పైపులను విరిచేశాయి. దేశిరెడ్డిగారిపల్లెకు చెందిన రవీంద్రారెడ్డి మామిడితోటలోని 8 గేట్‌వాల్వ్‌లు, డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

తిరుపతి(లీగల్), జనవరి 8 : ఓ వ్యక్తిని హతమార్చిన తమిళనాడు వేలూరుకు చెందిన బాలకృష్ణభాస్కర్‌కు జీవితఖైదుతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తిరుపతి పదవ అదనపు జిల్లా న్యాయమూర్తి రామచంద్రుడు సోమవారం తీర్పు చెప్పారు. 2022 జూలై 21న తమిళనాడుకు చెందిన కందస్వామిశ్రావణ్‌తో బాలకృష్ణ భాస్కర్ గొడవపడ్డారు. ఈ క్రమంలో తిరుమల కాలినడక షెడ్డులో నిద్రిస్తున్న సమయంలో సిమెంట్ ఇటుకతో తలపై మోది కందస్వామి శ్రావణ్‌ను బాలకృష్ణ భాస్కర్ చంపేశాడు. నిందితుడిని తిరుమల వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని, కోర్టులో హాజరుపరిచారు. కేసు నిరూపణ కావడంతో ఈ మేరకు శిక్ష విధించారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి



ఎంపీడీవో కార్యాలయం ముందు మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కల్లూరు, జనవరి 8: పులిచెర్ల మండలంలో జరిగిన అభివృద్ధి పనుల్లో చోటు చేసుకున్న అవినీతి, అక్రమాలపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని టీడీపీ నాయకులు సోమవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. టీడీపీ నాయకులు సుబ్బారెడ్డి, గోపినాయుడు, ధనంజయనాయుడు, మోహన్‌దాస్, బండ్లరమేష్, నజీర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో జరిగిన సిమెంటు రోడ్లు, నాడు-నేడు పథకంలో పాఠశాలల్లో నిర్మించిన భవనాలు, అంగన్‌వాడీ ప్రహరీల నిర్మాణ పనుల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని గతేడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో ఎంపీడీవో, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అధికారులు ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోగా సమాచారం హక్కు చట్టం కింద కొలతల బుక్కుల జిరాక్స్ కాపీలకు రూ.30,548 ఎంపీడీవో పేరుతో డీడీ రూపంలో చెల్లించాలని తెలపడం బాధాకరమన్నారు. అధికారులు స్పందించి అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రమణ్యంనాయుడు, కడియాల సుబ్రమణం, దేవ, పూల రమేష్, యర్రమరాజు, గూకంటి నాగరాజు, దామోదర్‌నాయుడు, శోభన్‌బాబు, జూపల్లిబాబు, మదన్‌మోహన్‌రెడ్డి, యుగంధర్, యర్రయ్య పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతో జీవ వైవిధ్యం



సహజ రంగులతో వేసిన సంక్రాంతి ముగ్గులు

కల్లూరు, జనవరి 8: పర్యావరణ పరిరక్షణతో జీవ వైవిధ్యాన్ని సాధిద్దామని ఎన్‌జీసీ డివిజనల్ కన్వీనర్ రాజేంద్ర, గ్రీన్ మాస్టర్ వెంకటశిద్దులు తెలిపారు. కల్లూరు ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం హెచ్‌ఎం శ్రీవాణి అధ్వర్యంలో సహజ రంగులతో ముందస్తు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతకు జీవవైవిధ్యం అవసరమన్నారు. ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాష్, స్నేహమాలిని, పద్మవేణి, సుభాషిణి, వేణుగోపాల్, హైదర్, సైదుల్లా పాల్గొన్నారు.

రాష్ట్రంలో ధాన్యం రైతు దగా : టీడీపీ



మాట్లాడుతున్న పీఎస్ మునిరత్నం

కుప్పం, జనవరి 8: రాష్ట్రంలో ఉద్యాన రైతు రోడ్డున పడ్డాడని, ధాన్యం రైతు దగాపడ్డాడని టీడీపీ కుప్పం నియోజకవర్గ అధ్యక్షుడు పీఎస్.మునిరత్నం, తెలుగు రైతు అధ్యక్షుడు చలపతిస్వామి విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో సగటున రోజుకు ముగ్గురు రైతులు ఆత్మహత్యల పాలవుతున్నారన్నారు. జగన్ రివర్స్ టెండర్ల పేరుతో ఇరిగేషన్ రంగాన్ని సర్వనాశనం చేశారన్నారు. రైతు ద్రోహి జగన్‌ను ఎందుకు క్షమించాలని నిలదీశారు. ప్రాజెక్టులు కట్టడం మాట అటుంచి కనీసం కాలువల్లో పూడికతీయడం కూడా మరచిన ప్రభుత్వమిదని విమర్శించారు. జగన్ పాలనలో యువత భవిష్యత్తు లేక కునారిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు ఉద్యోగాలు తెస్తే, జగన్ గంజాయి తెచ్చాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసి రాష్ట్రాన్ని ముందుకు తీసుకుపోతారని వారు స్పష్టం చేశారు.

ఓటరు వెరిఫికేషన్‌ను పకడ్బందీగా చేపట్టాలి



ఓటరు వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

రామకుప్పం, జనవరి 8: క్షేత్ర స్థాయిలో ఓటరు వెరిఫికేషన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు కోరారు. సోమవారం మండలంలో పలు పంచాయతీల్లో పార్టీ శ్రేణులు చేపట్టిన ఓటరు వెరిఫికేషన్‌ను వారు పరిశీలించారు. దొంగ ఓట్లు, డబుల్‌ఎంట్రీలు, చనిపోయిన వారి పేర్లు జాబితాల్లో ఉంటే గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని వారు సూచించారు. అదేవిధంగా గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని వంద శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమాల్లో క్లస్టర్ ఇన్‌చార్జి మహ్మద్‌రఫీ, యూనిట్ ఇన్‌చార్జిలు రామ్మూర్తి, సీతాపతి, గజేంద్ర, నేతలు గంట్లప్పగౌడు, వెంకటేష్, కృష్ణానాయక్, రామకృష్ణప్ప, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ విగ్రహావిష్కరణను అడ్డుకోవడం తగదు

పలమనేరు, జనవరి8 : అనంతపురం ఆర్ట్స్ కళాశాల వద్ద రెడ్డిసంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి విగ్రహావిష్కరణను పోలీసులు అడ్డుకోవడం తగదని రాష్ట్ర రెడ్డి సంఘం సలహాదారు పల్లెరుచులు అమరనాథరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన పలమనేరులో మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాన్ని భావితరాల వారు గుర్తుతెచ్చుకొంటూ దేశభక్తిని అలవరచుకునేందుకు దేశవ్యాప్తంగా వారి విగ్రహాలను ఏర్పాటు చేస్తుంటారని, ఇటువంటి కార్యక్రమాలను కూడా పోలీసులు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రభుత్వం స్పందించి సంబంధిత పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

రొంపిచెర్ల బస్టాండ్‌లో సమస్యలు తీర్చండి



రొంపిచెర్ల, జనవరి 8: రొంపిచెర్ల ఆర్టీసీ బస్టాండ్‌లో సమస్యలను తీర్చాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. ఈ బస్టాండ్‌కు చిత్తూరు, పీలేరు, పుంగనూరు ఆర్టీసీ డిపోలకు చెందిన బస్సులు వస్తుంటాయి. అయితే వాటికి సంబంధించిన బస్సుల రాకపోకల వివరాలు, ప్రయాణికుల సౌకర్యాలు కరువయ్యాయి. దీంతో బస్సులు ఎప్పుడు వస్తాయో తెలియక ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సోమవారం వారపు సంత నిర్వహణతో బస్టాండ్ ఆవరణలో ప్రైవేట్ వాహనాలు, దుకాణాలు పెడుతున్నారు. దీంతో బస్టాండుకు రావాల్సిన బస్సులు రోడ్డుపైనే ఆగి వెళ్లిపోతున్నాయి. సంబంధిత అధికారులు సమస్య గుర్తించి పరిష్కరించాల్సివుంది.

సిద్ధేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



రొంపిచెర్ల, జనవరి 8: రొంపిచెర్లలోని సిద్ధేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు రుద్రాభిషేకం, అర్చనలు చేసి నైవేద్యాలు సమర్పించారు. పూజలకు వచ్చిన వారికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

కల్లూరు : కల్లూరులో సోమవారం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ షుకూర్, ఎంపీటీసీ రెడ్డిఅహ్మద్ మాట్లాడుతూ రూ.25 లక్షల వరకు ఉచితంగా ఆరోగ్యశ్రీ పథకంలో వైద్యం పొందవచ్చని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి యుగంధర్ పాల్గొన్నారు.

కోలాహలంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



కృష్ణారెడ్డి శ్రీచైతన్య అకాడమిలో, మంగళం ప్రభుత్వ పాఠశాల, కుప్పం పబ్లిక్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు

పుంగనూరు రూరల్, జనవరి8: సంక్రాంతి సెలవులు మంగళవారంనుంచి ప్రారంభం అవుతుండడంతో పలు విద్యా సంస్థల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహించారు. పుంగనూరులోని పలు పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక కృష్ణారెడ్డి శ్రీచైతన్య చిల్డ్రన్స్ ఆకాడమీ పాఠశాల, మంగళం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో కలసి ఉపాధ్యాయులు సంక్రాంతి సంబరాలు జరుపుకొన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ దుస్తులు ధరించి, భోగిమంటలు వేశారు. గోవులకు పూజలు చేసి పండ్లు, పొంగళ్లు పెట్టారు. విద్యార్థులకు సంక్రాంతి విశిష్టత గురించి కృష్ణారెడ్డి శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి వివరించారు.

కుప్పం : కుప్పం పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు రంగవల్లులను అందంగా తీర్చిదిద్దారు. భోగిమంటలు, గంగిరెద్దులు, గొబ్బెమ్మలు, పొంగళ్లతో అచ్చం సంక్రాంతి వైభవాన్ని కొనితెచ్చారు. హరిదాసుల కీర్తనలు, సోది చెప్పడం వంటి కళారూపాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కుప్పం పబ్లిక్ స్కూల్ చైర్‌పర్సన్ బీసీఎన్.శాంత, ప్రిన్సిపాల్ సుప్రియ, హెచ్‌ఎం ప్రియ, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

చౌడేపల్లె : స్థానిక షిరిడిసాయి విద్యానికేతన్‌లో సోమవారం ఉపాధ్యాయులు సంప్రదాయ పద్ధతిలో పొంగల్ తయారు చేసి, ముగ్గులు వేసి గొబ్బెమ్మలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు సంక్రాంతి పర్వదినం ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించడంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

రామకుప్పం : బగళనత్తం ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు ముగ్గుల పోటీల్లో పాల్గొని రంగవల్లులు వేసి, గొబ్బెమ్మలను ప్రతిష్ఠించారు. భోగిమంటలు వేసి, గాలిపటాలను ఎగురవేసి ఆనందోత్సాహాలతో గడిపారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గ్రామంలో ఎద్దులను అలంకరించి, పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు నాగరాజు, ఉపాధ్యాయులు దేవకుమార్, కృష్ణమూర్తి, రాధాబాయి, కౌశర్‌అహ్మది, మోహనకుమారి, జానకి, పలువురు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చౌడేపల్లె షిరిడిసాయి విద్యానికేతన్‌లో పొంగల్ తయారు చేస్తున్న టీచర్లు, సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు, బగళనత్తం పాఠశాలలో భోగిమంటలు

రెండు నెలల్లో వైసీపీ భూస్థాపితం ఖాయం : చల్లా



చల్లా రామచంద్రారెడ్డికి మంగళహారతులు ఇస్తున్న మహిళలు

పుంగనూరు, జనవరి 8: మరో రెండు నెలల్లో అరాచక, దోపిడీ పాలన సాగిస్తున్న వైసీపీ ప్రభుత్వం టీడీపీ-జనసేన కలయికతో భూస్థాపితం కావడం తథ్యమని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. సోమవారం పుంగనూరు మండలం భీమగానిపల్లె, వెంకటాద్రికాలనీ, ఉలవలదిన్నె, రాంపల్లె, బాలాజీ కాలనీ, కమతంపల్లె తదితర గ్రామాల్లో టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరులో ప్రజాసంక్షేమం గాలికి వదిలేసి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలు వారి స్వప్రయోజనాల కోసం కాంట్రాక్టు పనులు చేసుకుని, దోపిడీలకు పాల్పడుతూ భారీగా లబ్ధిపొందారని విమర్శించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక ప్రాజెక్టు, పరిశ్రమ తెచ్చిన పాపనపోలేదని దుయ్యబట్టారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అక్రమాలు, అరాచకాలు, దౌర్జన్యాలు, స్మగ్లింగ్ చేయడం, తప్ప రాష్ట్రానికి చేసింది ఏమీ లేదన్నారు. తెలుగుదేశం పార్టీ పాలనలోనే అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని చెప్పారు. కార్యక్రమంలో పుంగనూరు, చౌడేపల్లె మండల టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి, గువ్వల రమేశ్‌రెడ్డి, ఆసూరి బాలాజీ, సుహేల్‌బాషా, సీవీరెడ్డి, కుమార్, దేశాది ప్రకాశ్, గంగాధర్, రమణ, వెంకటరమణ, అమర, శ్రీనివాసులు, గంగులప్ప, నాగరాజ, సద్దాం, సుబ్రహ్మణ్యం, రెడ్డెప్పయాదవ్, గిరిబాబు, పెద్దమోహన్‌నాయుడు, జనసేన నాయకులు పగడాల రమణ, చిన్నారాయల్, విరూపాక్షి, పాముల హరి, రమణ, బాలాజీ నాయక్, హరినాయక్ తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు స్వస్తి పలకండి : అమర్



తమ సమస్యను అమరనాథరెడ్డికి వివరిస్తున్న శంకరయ్య

బైరెడ్డిపల్లె, జనవరి 8 : రాష్ట్రంలో అరాచకపాలనకు స్వస్తిపలికి రాష్ట్రాన్ని పరిరక్షించుకోవడానికి ప్రజలందరూ టీడీపీతో కలసిరావాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పిలుపునిచ్చారు. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన మండలంలోని చప్పిడిపల్లె పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో పర్యటించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేయనున్న అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో దౌర్జన్యాలు, దోపిడీలు, భూకబ్జాలు పేట్రేగిపోయాయని విమర్శించారు. ప్రశ్నించే వారిపైనే తప్పుడుకేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తూ రాక్షసానందం పొందుతున్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించడానికి ప్రజలు ఎదురుచూస్తున్నారని, రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు.కాగా చప్పిడిపల్లెలో రెండేళ్లుగా కేన్సర్‌తో బాధపడుతున్న తన కుమార్తె బిందును ఆదుకోవాలని బాలిక తండ్రి శంకరయ్య అమరనాథరెడ్డికి విన్నవించారు. ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న బిందుకు వైద్యచికిత్సలందజేసి ఆదుకోవాలని ఎందరో ప్రజాప్రతినిధులకు విన్నవించినా తమ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం ద్వారా తమకు సహాయం అందకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచడంలేదని వారు వాపోయారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టి, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్ర నాయుడు, నాయకులు షౌకత్‌అలీ, మంజునాథరెడ్డి, రఘుచంద్రగుప్తా, అమరనాథరెడ్డి, తిప్పారెడ్డి, భువనచంద్రగౌడు, గౌరప్ప, అరుణ్, జలంధర్, చలపతి పాల్గొన్నారు.

వర్షంలోనూ అంగన్వాడీల నిరసన



కుప్పం, పుంగనూరులలో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కుప్పం, జనవరి8: కుప్పంలో అంగన్వాడీల సమ్మె సోమవారంనాడు కూడా కొనసాగింది. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరంలో దీక్షలు జరిపారు. ఒకవైపు హోరుమని వాన కురుస్తున్నా కదలకుండా నిరసన తెలిపారు. రోడ్డుమీదికి వచ్చి గొడుగులు వేసుకుని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు లలిత, అంగన్వాడీ యూనియన్ నేతలు మాట్లాడుతూ కనీస వేతనాలు ఇవ్వకుండా, ఇతర ప్రయోజనాలు కల్పించకుండా వైసీపీ ప్రభుత్వం అంగన్వాడీల పట్ల తీవ్ర అలక్ష్యం ప్రదర్శిస్తున్నదని విమర్శించారు. ఉద్యమాన్ని అణచివేయడానికి ఎస్మా చట్టం తెచ్చిందని, అణచివేత చర్యలకు జడిసేది లేదని స్పష్టం చేశారు. ఉద్యమాన్ని కొనసాగించి ప్రభుత్వ మెడలు వంచి డిమాండ్లను సాధిస్తామన్నారు.

పలమనేరు : పలమనేరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సోమవారం అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు వర్షం పడుతున్నా గొడుగులు పట్టుకొని నిల్చొని తమ నిరసన కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రభుత్వం అంగన్వాడీల ఆందోళనలను విరమింప జేసేందుకు జారీచేసిన జీవో2ను కూడా వారు ఖాతరు చేయకుండా తమ ఆందోళనలను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. తమపై ఎస్మా చట్టం చెల్లదన్నారు. ప్రభుత్వం నిరంకుశ ధోరణిలో తమ ఆందోళనలను అడ్డుకోవాలని చూస్తే అందుకు తగిన మూల్యం చెల్లించుకోవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గిరిధరగుప్తా, ఏఐటీయూసీ నాయకులు సుబ్రమణ్యం, ఐఎఫ్‌టీయూ లక్ష్మి, సమరశీల సంఘం నాయకురాలు లక్ష్మి, అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్ : అంగన్వాడీ కార్యకర్తల సమస్యలను ప్రభుత్వం తీర్చే వరకు సమ్మె ఆగదని, బెదిరింపులకు లొంగే ప్రసక్తేలేదని కార్యకర్తలు స్పష్టం చేశారు. సోమవారం పుంగనూరు రాంపల్లెలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెలో భాగంగా అంగన్వాడీ కార్యకర్తలు గొడుగులు పట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్మా చట్టాలను తీసుకురావడం సిగ్గుచేటుగా ఉందన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు రమణమ్మ, విజయకుమారి, సునీత, అర్చన, రెడ్డమ్మ, లక్ష్మీదేవి, సరళ, నారాయణమ్మ, విజయ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి



నిరసన దీక్ష చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పలమనేరు, జనవరి8 : మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని పలమనేరు మున్సిపల్ కార్మికులు నినాదాలు చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట వారు తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం కూడా ఆందోళనను కొనసాగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, టైంస్కేలు వర్తింపజేయాలని, ఔట్‌సోర్సింగ్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని, కార్మికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీనివాసులు, జాన్‌ఆనంద్, రమేష్‌బాబు, ఎం.బాలాజి, వై.బాబు,బి. వెంకటేసు, ఆర్. వాసు, సురేష్, ఎం. ఆనంద్, అంజి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవో స్పందనకు 10 అర్జీలు

పలమనేరు, జనవరి8 : పలమనేరు ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 10 మంది అర్జీలు సమర్పించారు. అర్జీదారుల నుంచి ఆర్డీవో మనోజ్‌కుమార్‌రెడ్డి అర్జీలు స్వీకరించారు. ఇందులో వన్‌బీ అడంగళ్ కోసం ముగ్గురు, భూవివాదాలపై 6 మంది, పట్టాదారుపాసుపుస్తకాల కోసం ఒకరు అర్జీ ఇచ్చారు. ఇందులో మండలాల వారీగా చౌడేపల్లి 3, వి.కోట 1, సోమల 2, పుంగనూరు 1, బైరెడ్డిపల్లి 1, పెద్దపంజాణి 1 అర్జీలు వచ్చాయని అధికారులు తెలిపారు.

క్రీడాదుస్తుల పంపిణీ



కల్లూరు, జనవరి 8: పులిచెర్లలో సోమవారం ఆడుదాం ఆంధ్ర క్రీడాకారులకు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి చేతులమీదుగా క్రీడాదుస్తులు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రాజశేఖర్‌బాబు తెలిపారు. మండలంలో 1596 టీ షర్టులు, 1596 క్యాప్‌లు పంచాయతీ కార్యదర్శులకు అందజేశామని తెలిపారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



చౌడేపల్లె, జనవరి8: స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద సోమవారం ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ ఎస్టీయూ క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు, ఉపాధాయులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గం



లోకనాథరెడ్డి, నరసింహారెడ్డి,నాజ్‌బాషా, గంగాధరయ్య

రొంపిచెర్ల, జనవరి 8: మండల ఎస్టీయూ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు జిల్లా కౌన్సిలర్ లోకనాథరెడ్డి తెలిపారు. రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాలలో ఆయన మాట్లాడుతూ మండల అధ్యక్షుడిగా ఓ.నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.మహమ్మద్‌షానవాజ్‌బాషా, ఆర్థిక కార్యదర్శిగా పి.గంగాధరయ్య, జిల్లా కౌన్సిలర్‌గా ఆర్.కృష్ణయ్య, పి.రమణారెడ్డి, పి.రవిశేఖర్‌రెడ్డి. డి.యల్లప్ప ఎన్నికయ్యారన్నారు. జిల్లా ఎస్టీయూ ఆర్థిక కార్యదర్శి మధుసూదనరెడ్డి ఎన్నికల పరిశీలకుడిగా హాజరయ్యారన్నారు.

వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ పరిశీలన



చౌడేపల్లె, జనవరి8: పెద్దకొండామారిలోని వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌ను సోమవారం ఢిల్లీ నుంచి వచ్చిన వైద్య బృందం సభ్యులు డాక్టర్ దీపక్, నిషా పరిశీలించారు. రోగులకు అందిస్తున్న చికిత్సలు, వైద్య పరికరాలను పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. మెరుగైన సేవలు అందించేదుకు తీసుకోవలసిన చర్యలను గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పవన్‌కుమార్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ

పుంగనూరు, జనవరి 8: పుంగనూరు దోబీకాలనీకి చెందిన విజయలక్ష్మికి సోమవారం వైఎస్ఆర్ బీమా చెక్కును మున్సిపల్ చైర్మన్ అలీంబాషా అందజేశారు. విజయలక్ష్మి భర్త వేణు అనారోగ్యంతో మృతి చెందగా బీమా పథకం ద్వారా మంజూరైన రూ.లక్ష చెక్కును బాధితురాలికి అందజేశారు.

గాలికుంటు నివారణకు చర్యలు



పుంగనూరు రూరల్, జనవరి8: పశువులకు గాలికుంటువ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పుంగనూరు పశుసంవర్థకశాఖ ఏడీ మనోహర్ తెలిపారు. సోమవారం మిట్టచింతలవారిపల్లెలో పశువులకు టీకాలు వేసి రైతులకు అవగాహన కల్పించారు.

వి.కోట బైపాస్‌పై మధ్యంతర ఉత్తర్వులు

వి.కోట, జనవరి 8: వి.కోటకు నాలుగు లైన్ల బైపాస్ రోడ్డు ఏర్పాటు అంశంపై రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నెర్నపల్లె మీదుగా కర్ణాటక వైపు వేస్తున్న రోడ్డు వల్ల తాము భూములు కోల్పోతున్నామని బాధితులు వేసిన రిట్ పిటీషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు బాధితుల వాదనలు విని తాత్కాలికంగా యథాస్థితిని కొనసాగించాలని, వారం రోజుల్లోపు అందుకు బదులివ్వాలని జాతీయ రహదారుల శాఖను ఆదేశించింది. దీంతో కొన్నిరోజులపాటు బైపాస్ రోడ్డు పనులు నిలుపుదల కానున్నాయి. ఇప్పటికే మండల ప్రజలు తూర్పు వైపున బైపాస్ రోడ్డు మంజూరు కాగా, కొందరు కావాలనే అలైన్‌మెంట్ మార్చి దానిని కర్ణాటక మీదుగా తీసుకువెళ్లారని జేఏసీ తరపున ప్రజాప్రయోజనాల వ్యాజం, అలైన్‌మెంట్ మార్పులో అవకతవకలు జరిగాయని మరో రిట్ పిటీషన్ దాఖలయ్యాయి.

అయోధ్య అక్షింతల పంపిణీ



సోమల, జనవరి 8: ఈనెల 22న అయోధ్యలో రాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని సోమల రామాలయానికి సోమవారం అక్షింతలు చేరుకున్నాయి. అర్చకులు రామరత్నం శాస్త్రి ప్రత్యేక అభిషేక పూజలు జరిపారు. స్థానిక యువకులు కరపత్రాలను, పోస్టర్లను, అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేస్తూ రామ సంకీర్తలను ఆలపించారు. కార్యక్రమంలో మోహన్‌రావు, గురుప్రసాద్, పవన్, శంకవరం గోపీ, పరమేశ్వర్, నవీన్ రాయల్, అభిషేక్, మోకీ, అనిల్, జగదీశ్, శ్రావణ పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

వర్షంలోనూ మున్సిపల్ కార్మికుల సమ్మె



చిత్తూరు, జనవరి 8: చిత్తూరు నగరపాలక కార్యాలయం వద్ద పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారంతో ఆరవరోజుకు చేరింది. వర్షం కురుస్తున్నా లెక్కచేయకుండా కార్మికులు సమ్మెను కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక సంఘం నేతలు మాట్లాడుతూ ఆరు రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వర్షాల కారణంగా పారిశుధ్యం లోపించినా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. సీఎం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘ నేతలు శరవణ, వెంకటేశ్, జయప్రకాష్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన అంగన్వాడీల నిరసన

నగరి, జనవరి 8: నగరి పట్టణంలో సోమవారం వర్షంలోనూ అంగన్వాడీలు గొడుగుల చాటున సమ్మె కొనసాగించారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆపేది లేదని వారు స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాక ముందు చేపట్టిన పాదయాత్రలో నేనున్నా.. నేను చూస్తున్నా అంటూ ప్రతి ఒక్కరి సమస్యలు తనకు తెలుసని, అందరికీ న్యాయం చేస్తామన్నారు. కానీ నేడు 27 రోజులుగా సమ్మె చేస్తున్నా మహిళలని కూడా చూడకుండా సమస్యలు పరిష్కరించక పోగా ఎస్మా జీఓ విడుదల చేసి బెదిరింపులకు పాల్పడటం విచారకరమన్నారు.

రాష్ట్రాన్ని ధ్వంసం చేసిన సీఎం జగన్: టీడీపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు తదితరులు

చిత్తూరు సిటీ, జనవరి 8: రాష్ట్రాన్ని సీఎం జగన్ ధ్వంసం చేశారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. సోమవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి తనయుడు కావడం, ఒక్క అవకాశం ఇవ్వాలని కోరడంతో జగన్ మాటలను నమ్మి ప్రజలు ఓట్లువేసి గెలిపించారని చెప్పారు. ఎన్నికల సందర్భంగా జగన్ రాష్ట్రంలోని వివిధ వర్గాల ప్రజలకు, ఉద్యోగులకు అనేక హామీలు ఇచ్చారని. వాటిని అమలు చేస్తున్నామని చెబుతూనే నాలుగున్నరేళ్లుగా మభ్యపెట్టారని విమర్శించారు. ఇప్పుడు జగన్‌ను వాళ్ళ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులే నమ్మడం లేదని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయడం అవసరమని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి సురేంద్ర కుమార్, అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజి, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వస్తేనే గ్రామాల అభివృద్ధి



కరపత్రాలను పంచుతున్న టీడీపీ నాయకులు

బంగారుపాళ్యం, జనవరి 8: రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్ అన్నారు. సోమవారం మండలంలోని నల్లంగాడు, కోటూరు గ్రామాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గొడుగు చేతబట్టి ఇంటింటికీ తిరిగి కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబు నాయుడు, రాజమాణిక్యం, మొగిలేష్, చెన్నకేశవులు, అనిల్, గిరి, గురుస్వామి, రమేష్, హరి, జనార్దన్ గౌడ్, హరిప్రసాద్, సురేంద్ర నాయుడు, బాలాజి తదితరులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోండి



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఏజీఎం శ్రీవాణి కిషోర్‌కుమార్ రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 8: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఖాతాదారుల సేవార్థం ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ సేవలు అమలు చేస్తోందని ఆ బ్యాంకు ఏజీఎం శ్రీవాణి కిషోర్‌కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక గాంధీరోడ్డులో ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్ కార్యాలయాన్ని రిబ్బన్ కత్తిరించి ఆయన ప్రారంభించారు. ఖాతాదారులను ఉద్దేశించి ఎస్బీఐ జనరల్ ఫ్రాంచైజ్ ఎం.డి. హషీం మాట్లాడుతూ వయస్సు, పాలసీలను బట్టి తక్కువ ప్రీమియంతో ఇన్సూరెన్స్ సేవలు అందిస్తామని చెప్పారు. ఇన్సూరెన్స్‌కు సంబంధించి ఎటువంటి సందేహాలున్నా 8839682277కు లేదా కార్యాలయానికి నేరుగా వచ్చి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ చీఫ్ మేనేజర్లు ఎ. ప్రసాద్, టి. శ్రీనాథ కుమార్, ఆర్బీవో చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు, ఎస్ఎంఈ చీఫ్ మేనేజర్ ఎస్. ముకుంద్, బ్యాంకు విశ్రాంత ఉద్యోగులు సీఎన్ చంద్రశేఖర్, కె. దామోదరం, పలువురు బ్యాంకు ఉద్యోగులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో సంక్షోభ రాష్ట్రంగా ఏపీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భానుప్రకాష్

నగరి, జనవరి 8: వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ సంక్షోభ రాష్ట్రంగా మారిందని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ విమర్శించారు. నగరిలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో 100కు పైగా సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేసి పన్నుల బాదుడుతో ప్రజల రక్తాన్ని పీల్చుతున్న ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందని విమర్శించారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి, దేశంలోనే ఏపీని అట్టడుగు స్థాయికి నెట్టిన జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు 2024లో ప్రజలు చరమగీతం పాడతారన్నారు. తాను ఇల్లు కట్టుకున్న అమరావతే రాజధానిగా ఆనాడు అని.. నేడు మూడు రాజధానులంటూ రాష్ట్రాన్ని మూడు ముక్కలాటచేసి నవ్వులపాల్జేశారన్నారు. కార్యక్రమంలో నగరి మండల టీడీపీ అధ్యక్షుడు శివకుమార్‌రెడ్డి, నాయకులు జ్యోతి నాయుడు, టీఎన్‌టీయూసీ బాలాజీ, గుణశేఖర్ నాయుడు, శేఖర్, భానుమతి, రాజశేఖర్, ఆనం విజయలక్ష్మి, మనోహర్, భాస్కర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన వినతులను సకాలంలో పరిష్కరించండి



అర్జీదారుడితో మాట్లాడుతున్న కమిషనర్

చిత్తూరు, జనవరి 8: స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అందే వినతులను సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో ఆమె ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. వినతులపై అక్కడికక్కడే అధికారులతో చర్చించారు. సమస్యలపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. స్పందన కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగంకు 04, ప్రణాళికవిభాగంకు 01 అర్జీ చొప్పున మొత్తం 05 అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు 'విజయం'లో ఏపీ మ్యాథ్స్‌ఫోరం జిల్లా మహాసభలు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 8: ఏపీ మ్యాథ్స్ ఫోరం జిల్లా మహాసభలు స్థానిక నాయుడు బిల్డింగ్స్‌లోని విజయం డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అరుణశివప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఆంధ్ర యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు రాధాకృష్ణారెడ్డి, డైట్ సీనియర్ విశ్రాంత ఉపన్యాసకులు మునిరత్నం, ఏపీ మ్యాథ్స్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రశేఖర్, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

30వ రోజు అన్నదానం



పేదలకు అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

బంగారుపాళ్యం, జనవరి 8: మండల కేంద్రంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద నిర్వహిస్తున్నఅన్నక్యాంటీన్‌లో సోమవారం నలగాంపల్లె పంచాయతీ మల్లేశ్వరం గ్రామానికి చెందిన నాగరత్నం నాయుడు, క్రిష్ణమ్మ నాయుడుల కుమారుడు సురేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ గౌడ్, రమేష్, రాధాక్రిష్ణమ నాయుడు, వంశీ చౌదరి, మంజునాథ్, గురుస్వామి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


గుడిపాలలో 173వ రోజు..

గుడిపాల, జనవరి 8: మండలంలోని అన్నక్యాంటీన్‌లో సోమవారం 173వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. బెంగళూరుకు చెందిన బి.వి. ఇంటర్నేషనల్ స్కూల్ యజమాని బాలాజి నాయుడు భోజన వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవి నాయుడు, టీడీపీ నాయకులు గోవిందు గౌడ్, సుధాకర్ యాదవ్, సుబ్రహ్మణ్యం, సుధాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల తనిఖీ

చిత్తూరు, జనవరి 8: చిత్తూరు నగరంలో మార్కెట్లు, ప్రధాన కూడళ్లు, రద్దీప్రాంతాల్లో పారిశుధ్య పనులను పక్కాగా చేపట్టాలని కమిషనర్ అరుణ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. మున్సిపల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెనేపథ్యంలో సోమవారం నగరంలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. కొంగారెడ్డిపల్లె, చర్చివీధిలోని కూరగాయల మార్కెట్లు, చేపలమార్కెట్‌ను తనిఖీ చేశారు. స్థానిక దుకాణదారులు, వ్యాపారస్తులు, మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. వ్యర్థాల నేపథ్యంలో ఎక్కడా డ్రైనేజ్ బ్లాక్‌కాకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీ గోవర్ధన్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్త మృతి



మార్కొండ నాయుడు (ఫైల్‌ఫొటో)

గుడిపాల, జనవరి 8: ఆంధ్ర సరిహద్దు ప్రాంతమైన వళ్లిమలైలో వెలసివున్న వళ్లీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ధర్మకర్త మార్కొండ నాయుడు సోమవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఈయన గత 20 సంవత్సరాలుగా ధర్మకర్తగా వ్యవహరిస్తున్నారు. ఈయన మృతిపట్ల చుట్టుప్రక్కల గ్రామస్తులు, మండలంలోని కందగిరికొండ ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎస్టీయూ డైరీ, క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరిస్తున్న ఎంఈవోలు, నాయకులు

వెదురుకుప్పం, జనవరి 8: వెదురుకుప్పం విద్యా వనరుల కేంద్రం వద్ద సోమవారం ఎస్టీయూ క్యాలెండర్లు, డైరీలను ఆ సంఘ నాయకులతోపాటు వెదురుకుప్పం ఎంఈవో-1 మహేశ్వరరావు,ఎంఈవో-2 దామోదరం ఆవిష్కరించారు. ఎస్టీయూ నాయకులు ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం, ఇ.పరమాత్మయ్య, న్యాంతుల్లా, పరదేశి, వాసుదేవరెడ్డి, పురుషోత్తం, ఈశ్వరానంద్, హరిబాబు, రవికిరణ్‌రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి వితరణ

విజయపురం, జనవరి 8: మండలంలోని పన్నూరు సబ్ స్టేషన్‌లోని రెయిన్‌బో పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయులు చంద్రయ్య వైస్ ఎంపీపీ మంజు బాలాజీ చేతుల మీదుగా క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. విద్యార్థులు క్రీడల్లో కూడా ప్రతిభ కనబరచాలని పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో జంబాడ సర్పంచ్ భాస్కర్‌రాజు, విజయపురం సర్పంచ్ జపమేరీ ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో జమ్మూ, కశ్మీర్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి



న్యాయమూర్తికి జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి

ఐరాల(కాణిపాకం), జనవరి 8: జమ్మూ, కశ్మీర్ హైకోర్టు సీనియర్ న్యాయమూర్తి, లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ తషి రబస్తాన్ కుటుంబ సమేతంగా కాణిపాక వరసిద్ధుడిని సోమవారం దర్శించుకున్నారు. ఆయన్ను ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన భాగ్యం కల్పించారు. దర్శనానంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్, తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న కారు - ఒకరికి గాయాలు



పాలసముద్రం, జనవరి 8: షోలింగర్ - పళ్లిపట్టు రోడ్డుపై ఎస్ఆర్ఆర్ కండ్రిగ వద్ద ఆదివారం రాత్రి ఓ వ్యక్తి కారులో అతి వేగంగా వచ్చి చెట్టును ఢీకొన్నాడు. అక్కడ వున్న గ్రామస్తులు 108కు సమాచారం ఇవ్వడంతో తమిళనాడులోని షోలింగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తమిళనాడులోని వాలాజా పట్టణానికి చెందిన గుణశేఖర్‌గా గుర్తించారు. ఆయనకు తీవ్ర గాయాలవ్వడంతో కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స కోసం వేలూరులోని సీఎంసీ ఆస్పత్రికి తరలించారు. పాలసముద్రం పోలీసు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ జానకిరామ్ కేసు నమోదు చేసుకుని, ప్రమాదానికి గురైన కర్ణాటక రిజిస్ట్రేషన్ కారును స్వాధీనపరచుకున్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

శ్రీరంగరాజపురం, జనవరి 8: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు సూచించారు. సోమవారం ఆరిమాకులపల్లె పీహెచ్‌సీలో వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రంలో చికిత్స తీసుకున్న రోగులు ప్రతి నెల ఫ్యామిలీ డాక్టర్ విధానంలో పరీక్షలు చేయించుకోవాలన్నారు. డాక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, గౌరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సారూ... ఇది పోలింగ్ కేంద్రమేనా

- ఓటర్లకు సౌకర్యాలు ఎక్కడ..?



పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రం

పూతలపట్టు, జనవరి 8: సారూ... ఇది ఆర్బీకే కేంద్రం... ఆర్బీకే కేంద్రాన్ని పోలింగ్ కేంద్రంగా మార్చడం సబబేనా... అంటూ ఒడ్డేపల్లి పంచాయతీ ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. జాతీయ రహదారికి పది అడుగుల దూరంలోనే పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంపై విమర్శలు తలెత్తుతున్నాయి. పూతలపట్టు మండలంలోని ఒడ్డేపల్లి పంచాయతీ బందార్లపల్లి గ్రామంలో గతంలో పోలింగ్ కేంద్రం ఉండేది. ఇక్కడ రెండు పాఠశాల భవనాలు, అంగన్వాడీ కేంద్రం, విద్యుత్ సరఫరా, తాగునీటి సౌకర్యం, అన్ని వసతులున్న చోట ఎన్నికలు జరిగేవి. ప్రజలు ప్రశాంతంగా ఇక్కడికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకుని వెళ్లేవారు. ఈ పోలింగ్ కేంద్రం పరిధిలో మొత్తం 1185 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 593 మంది పురుషులు, 592 మంది స్త్రీలు తమ ఓటుహక్కును వినియోగించుకునేవారు. ఇక్కడ ఓటర్లకు అన్ని సౌకర్యాలుండేవి. కానీ ఇక్కడ ఉన్న పోలింగ్ కేంద్రాన్ని చిత్తూరు, తిరుపతి జాతీయ రహదారిలోని ఒడ్డేపల్లి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారికి 15 అడుగుల దూరంలో ఉన్న రైతు భరోసా కేంద్రంలోకి అధికారులు మార్చారు. ఇక్కడ కరెంటు, తాగునీరు, టాయిలెట్ సౌకర్యం లేవు. కనీసం ఓటర్లు నిలబడేందుకు కూడా వీలులేని పరిస్థితి. కానీ అధికారపార్టీ నాయకుల ఒత్తిడితో ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రంగా ఈ రైతు భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సమంజసమేనా... అని ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. ఈ పోలింగ్ కేంద్రాన్ని బందార్లపల్లికి మార్చాలంటూ పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ కలికిరి మురళీమోహన్ కోర్టు మెట్లు ఎక్కడంతో పాటు జిల్లా ఎన్నికల అధికారికి కూడా ఫిర్యాదు చేశారు. కానీ ఆ ఫిర్యాదుపై అధికారులు ఇంతవరకు స్పందించకపోవడంపై ఓటర్లు ఎన్నికల అధికారులపై విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పోలింగ్ కేంద్రాన్ని గతంలోనే అన్ని సౌకర్యాలున్న బందార్లపల్లి పాఠశాలకు మార్పు చేస్తారో లేదో వేచిచూడాల్సి ఉంది.

వర్షంలోనూ సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

- చంటి బిడ్డలతో నిరసన తెలిపిన తల్లులు



చంటి బిడ్డతో వర్షం నిరసన తెలుపుతున్న మహిళా ఉద్యోగి

చిత్తూరు (సెంట్రల్), జనవరి 8: పర్మనెంట్, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలంటూ కలెక్టరేట్ ముందు సమగ్రశిక్ష అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారానికి 20వ రోజుకు చేరింది. వర్షం సైతం లెక్కచేయని ఉద్యోగులు గొడుగులు చేతపట్టి నిరసన తెలిపారు. పలువురు మహిళా ఉద్యోగులు చంటి బిడ్డలతో వర్షం తమ నిరసన వ్యక్తం చేశారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల కోసం 20 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో జేఏసీ నాయకులు విల్వనాథం, శ్రీనివాసులు, దేవరాజ్, కృష్ణమూర్తి, శరత్, హరి, చందు, గీత, సురేఖ తదితరులు పాల్గొన్నారు. కాగా సమ్మె చేస్తున్న వీరితో పాటు పారిశుధ్య, అంగన్‌వాడీలకు బీజేపీ జిల్లా అధ్యక్షులు జగదీశ్వర నాయుడు, శ్రీనివాసులు ఒక ప్రకటనలో మద్దతు తెలిపారు.

కంపు... కంపు...!

- గోకులం వీధిలో పేరుకుపోయిన చెత్త
- పట్టించుకోని అధికారులు



గోకులం వీధిలో గుట్టలా పేరుకుపోయిన చెత్త

చిత్తూరు రూరల్, జనవరి 8: నగరంలోని 39వ డివిజన్ గోకులం వీధిలో రోజువారీ చెత్త పేరుకుపోయి కంపు వాతావరణం నెలకొంది. గత వారం రోజుల నుంచి వీధిలో చెత్త తొలగించపోవడంతో వ్యర్థాలు, చెత్త గుట్టలా పేరుకుపోయింది. అదేవిధంగా ఓటీకే రోడ్డులోని హోటళ్ల వ్యర్థాలను సైతం ఈ వీధిలో పడేస్తుండటంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పరిసర నివాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. పైగా నగర మేయర్ ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్ అయినప్పటికీ నగరపాలక అధికారులు శ్రద్ధ చూపకపోవడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంటు వ్యాధులు ప్రబలకముందే అధికారులు చర్యలు తీసుకొని చెత్తను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నాని ఆమరణ దీక్ష భగ్నం చేయడం దారుణం

- ఖండించిన టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 8: టీడీపీ చిత్తూరు పార్లమెంటు అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని చేస్తున్న ఆమరణ దీక్షను భగ్నం చేయడం దారుణమని టీడీపీ నేతలు అన్నారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఓటర్ల జాబితాలోని దొంగ ఓట్లను తొలగించలేదని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న పులివర్తి నాని దీక్షను పోలీసులు భగ్నం చేశారని చెప్పారు. గతంలో జరిగిన తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో దొంగ ఓట్లతో గెలిచారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో దొంగ ఓట్లను తొలగించాలని ఆమరణ దీక్ష చేస్తున్న పులివర్తి నాని దీక్షా శిబిరం వద్ద తోపులాట, ఆయన కళ్లలో పెట్రోల్ పడటంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారని పేర్కొన్నారు. దీనికి పూర్తిగా ప్రభుత్వం బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యయుతంగా చేస్తున్న నిరసనను అడ్డుకోవడం దారుణమని, దీన్ని ఖండిస్తున్నామని చెప్పారు. విలేకరుల సమావేశంలో రాష్ట్ర పార్టీ కార్యదర్శి సురేంద్ర కుమార్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి వెంకటేష్ యాదవ్, జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పులివర్తి నాని దీక్షను భగ్నం చేయడం దారుణమని, ఈ సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని పార్టీ రాష్ట్ర తెలుగు మహిళ ఉపాధ్యక్షురాలు వైవీ రాజేశ్వరి, మాజీ మేయర్ కటారి హేమలత, జీజేఎం ఫౌండేషన్ చైర్మన్ గురజాల జగన్మోహన్, మాజీ టౌన్‌బ్యాంక్ చైర్మన్ షణ్ముగం ఒక ప్రకటనలో తెలిపారు.

నాని అరెస్టు ప్రజాస్వామ్య విరుద్ధం

విజయపురం: దొంగఓట్లను తొలగించాలని కోరుతూ తిరుపతిలో ఆమరణ దీక్ష చేపట్టిన జిల్లా టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని అక్రమ అరెస్టు ప్రజాస్వామ్య విరుద్ధమని మండల టీడీపీ అధ్యక్షుడు రమేశ్‌రాజు, రాష్ట్ర టీడీపీ లీగల్‌సెల్ కార్యదర్శి పురుషోత్తం ఖండించారు.

వర్షంతో మామిడికి నష్టం

పాలసముద్రం, జనవరి 8: మండలంలో కురిసిన వర్షంవల్ల మామిడి పంటకు నష్టం చేకూరుతుందని మామిడి రైతులు వాపోతున్నారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు పాలసముద్రం మండలంలో జడివాన కురిసింది. ఈ వర్షం వల్ల కుంటలకు నీరు చేరింది. మామిడి తోటలు పూత రావాల్సిన సమయంలో వర్షం కురవడంతో పూత సరిగ్గా రాదని రైతులు వాపోతున్నారు. ఎక్కువ మంది రైతులు వేలాది రూపాయలు ఖర్చుచేసి పూత రావడానికి వారం రోజులుగా మామిడి తోటలకు మందులు పిచికారీ చేశారు. ఈ జడివాన వల్ల పూత రావడం ఆలస్యం అవుతుందని, పిచికారీ చేసిన మందులు వృథా అవుతాయని వాపోతున్నారు.

18న జన భాగీదరి కార్యక్రమం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 8: జిల్లాస్థాయి జనభాగీదరి కార్యక్రమం ఈనెల 18న నిర్వహిస్తున్నట్లు జేసీ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి వివిధశాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ కలెక్టర్ షన్మోహన్ అధ్యక్షతన జన భాగీదరి కార్యక్రమ నిర్వహణకు జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటు చేశామని చెప్పారు. జన భాగీదరి, ఆడుదాం ఆంధ్రా, వికసిత్ భారత్ సంకల్ప యాత్ర, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీ వంటి అంశాలపై మంగళ, బుధవారాల్లో స్థానిక జిల్లాపరిషత్ మీటింగ్ హాలులో శిక్షణా తరగతులు జరుగుతాయని ఆయన వివరించారు. మండలస్థాయిలో ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలు ఈనెల 10వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో రాజశేఖర్, జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సెట్విన్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు

పూతలపట్టు, జనవరి 8: సెట్విన్ ఆధ్వర్యంలో పూతలపట్టు ఉన్నత పాఠశాల ఆవరణంలో సోమవారం మండలస్థాయి క్రీడాపోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి సెట్విన్ సీఈవో మురళీకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులు క్రీడల్లో కూడా రాణించాలని కోరారు. ఇందులో భాగంగా నిర్వహించిన క్రీడల్లో...

వాలీబాల్‌లో: పి.కొత్తకోట పాఠశాల ప్రథమ బహుమతి, పోలవరం ద్వితీయ, ముత్తిరేవుల పాఠశాల తృతీయ బహుమతి గెలుపొందాయి. కబడ్డీ బాలుర జట్టులో: పి. కొత్తకోట, ఎం. బండపల్లి, వినాయక విద్యామందిర్, టగ్ ఆఫ్ వార్ బాలుర విభాగంలో: పూతలపట్టు, బండపల్లి, తలుపులపల్లి, త్రోబాల్ బాలికల విభాగంలో: మంగళ విద్యాలయ, పూతలపట్టు, పి.కొత్తకోట ఉన్నత పాఠశాలలు, బాలికల కబడ్డీ విభాగంలో: పి. కొత్తకోట, పోలవరం, పూతలపట్టు ఉన్నత పాఠశాలలు, టగ్ ఆఫ్ వార్ బాలికల విభాగంలో: పూతలపట్టు, మంగళ విద్యాలయం, వినాయక విద్యామందిర్ పాఠశాలలు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెలుపొందాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామిరెడ్డి, సురేంద్ర, కృష్ణమూర్తి, మోహన్, కృష్ణవేణి, మాధవి, పీడీలు ప్రసాద్, మేనక, సతీష్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడిగా ఉమాశంకర్



ఫిజికల్ సైన్స్ ఫోరంలో ఎన్నికైన ప్రతినిధులు

విజయపురం, జనవరి 8: చిత్తూరు జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరం అధ్యక్షుడిగా ఉమాశంకర్‌ను సోమవారం తిరుపతిలోని టీపీపీఎం ఉన్నత పాఠశాలలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన విజయపురం మండలం గంగమాంబాపురం ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. అనంతరం రాష్ట్ర ఫోరం అధ్యక్షుడు మోహన్‌బాబు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కే. ధనుంజయసారథి, గౌరవ సలహాదారు నరోత్తమరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా శశిధర్, ఉపాధ్యక్షుడిగా రహమ్మత్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా కేపీ గణేశ్, ఆర్థిక కార్యదర్శిగా జ్యోతిప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రమేశ్ కుమార్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా సుభాషిణి, మహిళా కార్యదర్శులుగా పావనికుమారి, విజయలక్ష్మి, జాయింట్ సెక్రటరీగా మోహన్, షబ్బీర్, డివిజనల్ కార్యదర్శులుగా సుదర్శన్, గిరిబాబు, ప్రభాకర్, మంజునాథ్, నాథముని, జగన్మోహన్, బాబురెడ్డిలను, గౌరవ సలహాదారుగా నౌషద్‌ఆలీ, గంటా మోహన్, షంషేర్‌ఖాన్, ఆర్వీ రమణ, హరినాథ్‌బాబు, ధరణి తదితరులను ఎన్నుకున్నారు. ఎన్నుకున్న ప్రతి ఒక్కరినీ రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సరేంద్రరెడ్డి అభినందించారు.

సంక్రాంతి సంబరాలు



వేషధారణలతో సిద్ధమైన విద్యార్థులతో కరస్పాండెంట్ నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ లావణ్య

గంగాధరనెల్లూరు, జనవరి 8: గంగాధరనెల్లూరు మండలం కోటాగరం పంచాయతీ ఎట్టేరి శ్రీభానోదయ ఇంగ్లీష్‌మీడియం హైస్కూల్, శ్రీభానోదయ సీబీఎస్ఈ స్కూల్ ఉమ్మడిగా ఐదు రోజుల ముందే సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. స్కూలు ఆవరణలో సోమవారం విద్యార్థినులు, టీచర్లు వేర్వేరుగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్నారు. గాలిపటాలు ఎగురవేసి, పొంగుళ్లు పెట్టారు. గొబ్బె పాటలు పాడటం, భోగిమంటలు వేసి, హరిదాసు వేషధారణలతో విద్యార్థులు, సాంప్రదాయ చీరకట్టుతో విద్యార్థినులు వివిధ పాటలకు డ్యాన్స్‌లు వేసి అలరించారు. ఈకార్యక్రమంలో కరస్పాండెంట్ మద్దిపట్ల నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ లావణ్య, స్కూల్స్ ఇన్‌చార్జిలు మణిమేఘలై, మౌనిక పాల్గొన్నారు.

సామాజిక న్యాయ మహా శిల్పం సంతకాల సేకరణ

వెదురుకుప్పం, జనవరి 8: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని సోమవారం వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లె సచివాలయంలో చేపట్టారు. ఈ క్రమంలో అంబేడ్కర్ నిర్దేశించిన సామాజిక న్యాయ మార్గంలో నడుస్తానని ప్రతిజ్ఞ చేస్తున్నానని సంతకాలు చేశారు. డీడీవో ధనలక్ష్మి, సర్పంచ్ బండి శశికుమారి, సచివాలయ ఉద్యోగులు హాజరయ్యారు.

కొండ మల్లీశ్వరుడికి క్షీరాభిషేకం

వెదురుకుప్పం, జనవరి 8: వెదురుకుప్పం మండలం డీఆర్ఎస్‌కండ్రిగ సమీపంలో అరుణగిరి క్షేత్రంలో కొలువై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ కొండ మల్లీశ్వరస్వామికి సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో పాటు క్షీరాభిషేకం, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. డి.రమేశ్ దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు.

కవితా సంపుటి ఆవిష్కరణ



కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

చిత్తూరు కల్చరల్, జనవరి 8: చిత్తూరు నివాసి గణితోపాధ్యాయురాలు రచయిత్రి మోహనశేఖర్ రచించిన యశోజ్యోతి కవితా సంపుటిని ఆదివారం రాజమండ్రిలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ తెలుగు మహా సభల్లో సాహితీవేత్తలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహనశేఖర్ సోమవారం ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఇప్పటి వరకు 29 కవితా సంపుటిలను రచించానని, పలువురు సాహితీ విమర్శకుల నుంచి ప్రశంసలు పొందానని తెలియజేశారు. రాజమండ్రిలో జరిగిన అంతర్జాతీయ తెలుగు మహాసభల్లో తన ప్రతిభను గుర్తించి కవితా సంపుటిని ఆవిష్కరించిన నిర్వాహకులకు, సాహితీవేత్తలకు, సినీ ప్రముఖులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న విజయానంద రెడ్డి

చిత్తూరు, జనవరి 8: చిత్తూరు నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఇంజనీరింగ్ విభాగ కార్మికులకు సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానంద రెడ్డి సోమవారం దుస్తులను పంపిణీ చేశారు. ప్రతి ఏటా మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలోనే సోమవారం 700 మంది కార్మికులకు రూ.1500 విలువ చేసే దుస్తులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్ రెడ్డి, కార్పొరేటర్ మధురెడ్డి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

చిట్టిబాబుకు టీడీపీ నేతల సన్మానం



చిట్టిబాబును అభినందిస్తున్న కిషన్‌చంద్, నాయకులు

పాలసముద్రం/వెదురుకుప్పం, జనవరి 8: పాలసముద్రం మండలానికి చెందిన భీమనేని చిట్టిబాబు నాయుడును తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించడంతో సోమవారం గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు కార్యదర్శి వాసు నాయుడు, నాయకులు జె. విజయ్ కుమార్, రవి నాయుడు, సాంబశివన్, శబరివాసన్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా వెదురుకుప్పం మండలానికి చెందిన టీడీపీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్, నేతలు గాలి బాబు నాయుడు, కావలి చక్రి, మురళీ నాయుడు తదితరులు చిట్టిబాబుకు అభినందనలు తెలిపారు.